ప్రజా గళానికి వేదిక... గాంధీపార్క్



జీవీఎంసీ గాంధీ పార్కు

- ధర్నాచౌక్‌గా మారిన వైనం
- నిరసన ప్రదర్శనలు, సభలకు కేరాఫ్



మద్యం పాలసీకి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న మహిళలు (ఫైల్)



సీఐటీయూ సభ వద్ద కార్మికుల సందడి (ఫైల్)

సీతమ్మధార: ఢిల్లీలో జంతర్ మంతర్.. తెలంగాణలో ధర్నా చౌక్ ప్రజా ఉద్యమాలు, ధర్నాలకు కేరాఫ్ అన్న విషయం తెలిసిందే. విశాఖలో జీవీఎంసీ గాంధీపార్కు కూడా అంతే ఫేమస్ అవుతోంది. ఈ పార్కు ప్రజా ఉద్యమాలకు వేదికగా నిలుస్తోంది. గతంలో సోమవారం వస్తే జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద పలు ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ధర్నాలు, ఆందోళనలు, నిరసన దీక్షలు జరిగేవి. అక్కడ పోలీసుశాఖ ధర్నాలు నిషేధించడం తెలిసిందే. దీంతో అందరి చూపు ఆశీలమెట్ట వద్ద జీవీఎంసీగాంధీ పార్కు మీదనే పడింది.

అన్ని వర్గాలకూ చోటు

నగరంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గంతో పాటు రాజకీయ పార్టీలు చేపట్టే ఆందోళనలు గాంధీపార్కు చెంతనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పే ప్రజాసంఘాలు, ప్రతిపక్షాలకు ఇదే వేదిక అవుతోంది. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ఇక్కడే బహిరంగ సభలు, సమావేశాలు జరుగుతుంటాయి. ఇక స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరం ఇక్కడే 1282 రోజులుగా కొనసాగడం విశేషం. నిత్యం ఇక్కడ ఏదో ఒక ధర్నా, ప్రదర్శన, ర్యాలీతో గాంధీపార్కు సందడి సందడిగా కనిపిస్తుంది.

నూతన మద్యం పాలసీకి వ్యతిరేకంగా ఆందోళన

కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ద్వారా మద్యం షాపులకు బార్లా తలుపులు తెరిచిన వైనాన్ని నిరసిస్తూ మహిళా సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకూ గాంధీ పార్కే వేదిక అయింది. తాజాగా ఉచిత ఇసుక దొరకడం లేదంటూ సీపీఎం కూడా ఇక్కడే ధర్నా చేయడం విశేషం. ఇంకా జీవీఎంసీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నా పర్మినెంట్ చేయడం లేదని, కనీస వేతనాలు ఇవ్వడం లేదంటూ జీవీఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు కూడా కొద్దిరోజుల కిందట ఇక్కడే ధర్నా చేశారు. ఇక ఊబర్, ఓలా వాహనాల డ్రైవర్లు కూడా తమకు వేధింపులు తప్పడం లేదని ఆందోళన చేపట్టారు. ఇక్కడ నిరసన తెలిపే ప్రజాసంఘాలు గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు అందజేస్తున్నాయి. ఇక్కడ ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేయడం ద్వారా ప్రభుత్వానికి తమ సమస్యలు తెలుస్తున్నాయని ప్రజాసంఘాలు, ప్రతిపక్ష పార్టీలు భావిస్తున్నాయి. తద్వారా ప్రజా సమస్యల పరిష్కార వేదికగా గాంధీపార్కు నిలుస్తుందంటే అతిశయోక్తి కాదు.

నిత్యం పోలీసుల పహారాలో..

ఈ పార్కు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. అయినా బహిరంగ సభలు, ధర్నాలు, ఆందోళనల సమయంలో ద్వారకా, ఎంఆర్‌పేట, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ స్టేషన్‌పోలీసులు కూడా బందోబస్తు నిమిత్తం ఇక్కడికి అధిక సంఖ్యలో చేరుకుంటారు. ఇక్కడ పోలీసు వాహనం కనిపించిందంటే చాలు ఇక్కడ ఏదో అలజడి వున్నట్టే లెక్క అని జనాలు భావించడం ఆనవాయితీగా మారింది. ఏది ఏమైనా జీవీఎంసీ గాంధీ పార్కు ధర్నా చౌక్‌గా మారిందనడంలో అతిశయోక్తి లేదు.

ఆదర్శనేత ద్రోణంరాజు శ్రీనివాస్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్



శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కల్యాణి

జగదాంబ: తండ్రి బాటలో నడిచి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పని చేసిన నాయకుడు ద్రోణంరాజు శ్రీనివాస్ అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దివంగత నేత ద్రోణంరాజు శ్రీనివాస్ 4వ వర్ధంతిని ఆయన కుమారుడు శ్రీవత్సవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ 39వ వార్డులో స్వామీవివేకానంద సంస్థలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌తో పాటు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తైనాలవిజయ కుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ద్రోణంరాజు శ్రీనివాస్ ఆదర్శ రాజకీలకు కేరాఫ్ అని కొనియాడారు. తండ్రి సత్యనారాయణరాజు వారసుడిగా రాజకీయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారన్నారు. అనంతరం అంధులకు కిరాణ సామగ్రి, విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జాన్‌వెస్లీ, డాక్టర్ జహీర్‌అహ్మద్, బెహరా భాస్కరరావు, తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ చెన్న జానకీరామ్, అలపన కనకరెడ్డి, పీతలవాసు, కొల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

హాజరు నమోదు తప్పనిసరి

- జోన్-4 కమిషనర్ మల్లయ్యనాయుడు
- వార్డుల్లో విస్తృత పర్యటన



30వ వార్డు కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: పారిశుద్ధ్య సిబ్బంది తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సూచించారు. ఆయన జోన్ పరిధిలోని 29, 30, 38 వార్డుల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా 30వ వార్డులో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అఫీసియల్ కాలనీలో అపార్ట్‌మెంట్స్ దగ్గర పారిశుధ్య కార్మికులు చెత్త సేకరిస్తున్న తీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నివాసదారులు తప్పకుండా తడి-పొడి, ప్రమాదకర చెత్తను వేరుచేసి ఇవ్వాలన్నారు. ప్రతి ఇల్లు, దుకాణాల్లో మూడురకాలు బిన్‌లు వినియోగించాలని సూచించారు. జీవీఎంసీ 29వ వార్డులో వీధిదీపాలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆయన పరిశీలన చేసి వెంటనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. నీటిసరఫరా కూడా సమాయానికి ఇవ్వాలన్నారు. అనంతరం జీవీఎంసీ 38వ వార్డులో డ్రై డే ఫ్రైడే నిర్వహించారు. దోమలు ఏవిధంగా ఉత్పత్తి అవుతాయి.. వాటి వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జోన్-4 ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, బయోలజిస్ట్, వార్డు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి



జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో పాల్గొన్న నాయకులు

సీతమ్మధార(విశాఖ ఉత్తర): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరాహారదీక్షకు సాంప్రదాయ మత్స్యకార సంక్షేమ సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందని గుర్తు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా సెయిల్‌లో విలీనం చేయాని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా ఆశించకుండా దేశంలోనే అత్యుత్తమంగా నడుపుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం లేదా మూసేస్తాం అని బాధ్యతా రహితంగా మాట్లాడితే ప్రజల ఆగ్రహాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పడు, ప్రజాగాయకుడు దేవిశ్రీ, మత్స్యకార సంఘం నాయకులు ఎం.లక్ష్మి, జి.లక్ష్మి, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

డాబాగార్డెన్స్: రెల్లి, రెల్లి ఉపకులాలకు 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని విశాఖ జిల్లా రెల్లి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనకు ఈ నెల 7న డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్టు తెలిపారు. తాడివీధిలో గల సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఏ,బీ,సీ,డీ కేటగిరీగా వర్గీకరించవచ్చునన్నారు. రెల్లి, రెల్లి ఉపకులాల దుర్భర జీవన విధానం, వెనుకబాటు తనాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. గతంలో రెల్లి కులస్తులకు కల్పించిన ఒక శాతం రిజర్వేషన్ ఉపయోగకరంగా లేకుండా పోయిందన్నారు. 5 శాతం రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. సమావేశంలో ఎస్ కల్యాణముని, ఇంటి గురుమూర్తి, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, దశమంతుల వేణుగోపాల్, చెన్నా వెంకట్రావు, వడ్డాది జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మను దర్శించుకున్న వాసుపల్లి



దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు పూర్ణామార్కెట్ సమీపంలో కొలువుతీరిన శ్రీశ్రీశ్రీ దుర్గాలమ్మ అమ్మవారిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ సందర్శించారు. బాలాత్రిపుర సుందరి అవతారంలో దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి వాసుపల్లి పూజలు నిర్వహించి,హారతులు ఇచ్చారు. అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని, నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలుపన కనకరెడ్డి, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ దిలీప్, ఇతర నాయకులు సుధా,తదితరులు ఉన్నారు.

గ్రామ స్థాయి నుంచి వ్యాధులపై అవగాహన

ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ నాగేశ్వరరరెడ్డి



ప్రసంగిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

మహారాణిపేట: వ్యాధులపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ నాగేశ్వరరరెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. పేగు సంబంధిత వ్యాధులపై వైజాగ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ క్లబ్ అసోసియేషన్, కోలైటా అండ్ కార్న్స్ ఫౌండేషన్ ఇండియా సంయుక్తంగా విశాఖ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఎనిమిదో జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం మొదలైంది. నగరంలోని ఓ హోటల్‌లో కేజీహెచ్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ ఆధ్వర్యంలో జరిగింది. జాతీయ సదస్సుకు దేశ, విదేశాలతో పాటు బ్రిక్స్ నుంచి కూడా పది మంది గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణులు హాజరై ఆయా దేశాల్లో అమలవుతున్న నూతన వైద్య పద్ధతులను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేగు తదితర వ్యాధులకు నూతన వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ వ్యాధులపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా కొంత వరకు తగ్గించవచ్చునన్నారు. విదేశీ వైద్యులు డాక్టర్ కేడియాచే క్రోన్స్, డాక్టర్ సైమన్ ట్రావిస్(యూఎస్ఏ), డాక్టర్ అజిత్ సూద్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ చలపతిరావు, ఏఎంసీ మాజీ హెచ్‌వోడీ డాక్టర్ పెదవీర్రాజు,డాక్టర్ శివప్రసాద్,డాక్టర్ విశ్వనాథ్, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు ఇద్దరు వైద్యులు

మహారాణిపేట: కేజీహెచ్ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ గా డాక్టర్ ఎం.చంద్రశేఖరం నాయుడు నియమితులయ్యారు. ఈయన నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. అలాగే ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎండోక్రానాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఎం.కీర్తన నియమితులయ్యారు. డాక్టర్ కీర్తన కర్నూల్ మెడికల్ కాలేజీ నుంచి ఇక్కడకు వచ్చారు.

నిలిచిపోయిన టెండర్లను పునఃప్రారంభించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నిలిచిపోయిన టెండర్ల ప్రకియను వెంటనే పునఃప్రారంభించాలని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు పరిపాలన భవనం వద్ద శుక్రవారం అఖిలపక్ష కాంట్రాక్ట్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ క్యూఏటీడీ, ఎస్‌టీఈడీ, సీఎంఎస్ విభాగాల్లో టెండర్లు సకాలంలో పూర్తి కాకపోవడంతో సుమారు 500 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. ఉక్కు యాజమాన్యం కావాలనే టెండర్ల ప్రక్రియను జాప్యం చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యం ఆ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగుల తోడ్పాటుతో సంస్థ ప్రగతి



వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: పనిచేసే చోట మానసిక ప్రశాంతతకు తగిన ప్రాధాన్యమివ్వాలని, తద్వారా సంస్థ ప్రగతికి ఉద్యోగులు మరింత తోడ్పాటు అందిస్తారని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శుక్రవారం వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రారంభించిన కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహిస్తే రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తారన్నారు. ఒత్తిడిని అధిగమించి సంస్థకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాయింట్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తూ టీపీటీ నుంచి వుడా తర్వాత వీఎంఆర్‌డీఏగా రూపాంతరం చెంది ప్రజల్లో బలమైన ముద్ర వేసుకుందని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన విజన్ 2047 ద్వారా వీఎంఆర్‌డీఏ ప్రధాన పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శిల్పా, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, డీఎఫ్‌వో శాంతిస్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్టేట్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



సీఈని కలిసిన జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన శివప్రసాదరాజును జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి నేతృత్వంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. చీఫ్ ఇంజినీర్ మాట్లాడుతూ అందరం కలిసి నగరాభివృద్ధికి కృషి చేద్దామని సూచించారు. కార్యక్రమంలో కన్వీనర్ రాజాన వెంకట్రావు, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షులు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, సలహాదారులు పైలా కృష్ణారావు, ప్రసాద్, ఆర్‌ఏ నాయుడు, అల్లు గోవిందరావు సత్యనారాయణ, గణేష్, పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



అన్వేష్‌ను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్

డాబాగార్డెన్స్: విశాఖలో జరిగిన బాక్సింగ్ స్టేట్ మీట్‌లో శ్రీకాశ్యపు విద్యార్థి సాండి అన్వేష్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాశ్యపు విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాస్ అభినందలు తెలిపారు. స్కూల్ పీటీ దుర్గా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అగ్నిమాపక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జాజిమొగ్గల



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కమిటీతో రాష్ట్ర సంఘ నాయకులు, జిల్లా అధికారులు

అల్లిపురం: ఉమ్మడి విశాఖ జిల్లా అగ్నిమాపక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా జాజిమొగ్గల శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రం అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ కేవీటీ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా పీవీ సత్యనారాయణ, సహాయ ఎన్నికలు డీఎల్ నారాయణ, గణేష్, సప్తగిరి పర్యవేక్షణ లో నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా జాజిమొగ్గల శ్రీను, ఉపాధ్యక్షుడి గా కె. రమేష్ బాబు, కార్యదర్శిగా ఎం.తిరుమల ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఎస్.రామకృష్ణ, కోశాధికారిగా కదిరి ఎల్లాజీ, సలహాదారుగా యం.సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. నూతన కమిటీకి జిల్లా అగ్నిమాపక అధికారులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గోవింద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పెదగంట్యాడ: ఏపీ గవర్నమెంట్ ఐటీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యూవీ శివకుమార్ ఎన్నికయ్యారు. ప్రభుత్వ నూ ఐటీఐలో కొత్త కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పి.శ్రీనివాసు, ఉపాధ్యక్షురాలిగా ఎం.లతాదేవి, కోశాధికారిగా ఎం.ఎస్.డి.డి.వర్మ, సహాయ కార్యదర్శిగా కిరణ్‌కుమార్, సభ్యులుగా తులసీరావు, పీవీడీ ప్రసాద్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.రాములప్పడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కొత్త కార్యవర్గాన్ని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ శ్రీనివాస్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కషి చేస్తామన్నారు.

మంగళ కారిణి.. శక్తి స్వరూపిణి

దసరా మహోత్సవాలు దక్షిణ నియోజకవర్గంలో వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రెండో రోజు అమ్మవారిని గాయత్రిమాతగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలతో పాటు మండపాల్లో కొలువుదీరిన జగన్మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా అంటూ సంకీర్తనలు ఆలపించారు.



లలితాదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



దుర్గాలమ్మ



గాయత్రీదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ



అల్లిపురం మెయిన్‌రోడ్డు ధనశక్తి దుర్గాదేవి పీఠంలో..



గాయత్రి దేవి అలంకరణలో ఉమాదేవి

డాబాగార్డెన్స్: పాతనగరంలోని కురుపాం మార్కెట్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండో రోజు శుక్రవారం కన్యకా పరమేశ్వరి లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ సామూహిక సువాసిని పూజ నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో కట్టమూరి ప్రసన్న బృందం సౌందర్యలహరి సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించింది. శనివారం అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమివ్వనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్లు కరిమిశెట్టి వెంకటరమణ, వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పూసర్ల సంజీవి, దేవాలయ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, కోశాధికారి దోమ వెంటక బాలాజీ కుమార్ పాల్గొన్నారు.

బాలత్రిపుర సుందరిగా

35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అల్లిపురం: యారాడ కొండపై వెలసిన సాగర గిరిపై కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

➡ టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ విశేష పూజలు నిర్వహించారు.

➡ అల్లిపురం మెయిన్‌రోడ్డులోని శ్రీ ధనశక్తి దుర్గాదేవి పీఠంలో 20 అడుగుల ఎత్తు కలిగిన అమ్మవారి ఉగ్రరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది.

చీరల పంపిణీ



పేదలకు చీరలు, బియ్యం పంపిణీ చేస్తున్న పచ్చిరిపల్లి రాము తదితరులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే, మాజీ వీఎంఆర్‌డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరిపల్లి రాము కుమ్మరవీధిలోని వార్డు కార్యాలయంలో ద్రోణంరాజు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవహారాన్ని జయప్రదం చేయండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 6న నిర్వహించనున్న మానవహారాన్ని జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలన్న డిమాండ్లతో అగనంపూడి నుంచి గాజువాక వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉద్యోగులంతా పాల్గొనాలని కోరారు.